## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆకాంక్షించారు.
- న్యాయ స్వాతంత్ర్యం ప్రజల హక్కు అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు.
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.
- ప్రపంచ స్థాయి ప్రమాణాలకు ధీటుగా రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

====================

పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. పంచాయతీరాజ్ చట్టానికి చట్టబద్ధత కల్పించిన ఏప్రిల్ 24వ తేదీని జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంగా ప్రతీ ఏటా జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు సహా పలువురు శాసన సభ్యులు పాల్గొన్నారు.

====================

న్యాయ సేవలో చిరస్మరణీయ సేవాస్ఫూర్తికి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆదర్శంగా నిలిచారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తిగా నియమితులై రేపు బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లిసా గిల్ కొనియాడారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ సందర్భంగా హైకోర్టు మొదటి కోర్టు హాలులో ఈరోజు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ లిసా గిల్ మాట్లాడుతూ ప్రతిభావంతమైన న్యాయవేత్తగా, దూరదృష్టి కలిగిన పరిపాలకుడిగా, ధీరజ్ సింగ్ ఠాకూర్ నిలిచారని పేర్కొన్నారు. సాంకేతికత ఆధునికీకరణలో ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించారని జస్టిస్ లిసా గిల్ పేర్కొన్నారు. న్యాయ స్వాతంత్ర్యం ప్రజల హక్కు అని, ఆ హక్కును పరిరక్షించే బాధ్యత న్యాయ వ్యవస్థపై ఉందని జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. న్యాయమూర్తి బాధ్యతలు అత్యంత క్లిష్టమైనవని అన్నారు.

====================

ఉత్తరాంధ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయం నుంచి మంత్రి ఈరోజు మాట్లాడుతూ, అధికంగా పెట్టుబడులు ఉత్తరాంధ్ర జిల్లాలకు తరలివస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషితోనే గూగుల్, అర్సెలార్ మిట్టల్ వంటి సంస్థలు ఆ ప్రాంతంలోకి వస్తున్నాయని వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా

పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఏర్పాటు అవుతున్నాయని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

రాష్ట్రంలోని ఆరోగ్య వ్యవస్థను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.వై.టియోతో మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వై వై టియోకు మంత్రి వివరించారు. ముఖ్యంగా వైద్య సేవలను మెరుగుపరిచేందుకు గేట్స్ ఫౌండేషన్ తో కుదుర్చుకున్న ఒప్పందం, ఇందుకు తగ్గట్లు తీసుకుంటున్న చర్యల గురించి తెలిపారు. పేద రోగులకు అందించే వైద్య సేవల్లో క్రత్రిమ మేధ (ఏఐ)ను వినియోగిస్తున్నామని, ఎన్సీడీ-04 ద్వారా ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు స్క్రీనింగ్ చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రోగుల ఆరోగ్య వివరాలతో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ సిద్ధం చేస్తున్నామని మంత్రి చెప్పారు.

====================

విరామం

====================

ఎకనమిక్ టైమ్స్ ప్రకటించిన బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు అందుకోనున్నారు. ముంబైలో జరిగే ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా ప్రముఖ పారిశ్రామికవేత్తలు హాజరయ్యే ఎకనమిక్ టైమ్స్ సంస్థ ఈ అవార్డును ముఖ్యమంత్రికి ప్రధానం చేయనుంది. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సహా స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ లాంటి వినూత్న విధానాలు అమలు చేసినందుకుగాను ఎకనామిక్ టైమ్స్ ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది.

====================

సింగపూర్ పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రుల బృందం మెరీనా బ్యారేజ్ ని ఈరోజు సందర్శించింది. సింగపూర్ కు తాగునీరు అందించడంతో పాటు వరద నియంత్రణకు అలాగే వినోద కేంద్రంగా మెరీనా బ్యారేజ్ నిలుస్తోంది. పర్యావరణ అనుకూల నీటి సంరక్షణ విధానాలతో సింగపూర్ సాధించిన పురోగతి, మెరీనా బ్యారేజ్ ప్రాముఖ్యతను నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ సిటీస్ డైరెక్టర్ ఖూ టెంగ్ చై మంత్రులతో పంచుకున్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ సింగపూర్ నీటి సమస్యలను ఎలా అధిగమించింది వంటి అంశాలను మంత్రుల బృందం అధ్యయనం చేసింది. కృష్ణా నది తీరం, అమరావతి రాజధాని ప్రాంతాల్లో ఈ తరహా అభివృద్ధి నమూనాలు అమలు చేసే అవకాశంపై చర్చించింది. ఈ పర్యటనలో రాష్ట్ర మంత్రులు కె. అచ్చెన్నాయుడు, బి.సి. జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

====================

గ్రామాలే దేశ అభివృద్ధికి పునాది అని విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 33వ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ, 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు బలమైన చట్టబద్ధత లభించిందని తెలిపారు. దాంతో అప్పటి నుంచి గ్రామీణ స్వపరిపాలన బలోపేతం అవుతోందని అన్నారు. దేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తి, డీపీవో శ్రీనివాసరావు, డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

====================

ప్రభుత్వ పాఠశాలలలో లభించే ప్రయోజనాల గురించి తల్లితండ్రులకు అవగాహన కల్పించి, వారి పిల్లలను ఆ పాఠశాలల్లో చేర్చేలా చూడాలని ఏలూరు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి కోరారు. ఏలూరు మండలం వోణంగి గ్రామం అంగన్వాడి ప్రీస్కూలులో 5 సంవత్సరాల వయసుగల పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్చే కార్యక్రమంలో ఆమె ఈరోజు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో అంగన్వాడి ప్రీస్కూలులో విద్యా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న 7వేల 480 మందిలో ఇప్పటివరకు 4వేల 572 మందిని ప్రాథమిక పాఠశాలలో చేర్చామని కలెక్టర్ చెప్పారు.

=====================

తెలంగాణ, అంతర కర్ణాటక, తమిళనాడు మీదుగా తూర్పు విదర్భ నుండి కొమరిన్ ప్రాంతం వరకు ఉన్న నిన్నటి ద్రోణి సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారిణి జి.లక్ష్మీ తెలియజేస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

=====================

రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈరోజు 207 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు తెలిపారు. రేపు రాష్ట్రంలో 14 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 28 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందన్నారు. వడగాలులు, ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

=====================
=====================